

డెంగీతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

డెంగీతో వ్యక్తి మృతిచెందిన సంఘటన చాట్రాయిలో బుధవారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొండ్రు బాబూరావు(33) తాపీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాబూరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రక్తకణాలు పూర్తిగా తగ్గిపోయాయని, డెంగీగా నిర్ధారించారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ ఎస్.మురళీమోహన్ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లో దోమలు వ్యాప్తిచెందకుండా బ్లీచింగ్ చల్లించారు. వైసిపి నాయకులు దామెర ప్రసాద్ సంతాపం తెలిపారు.

సమస్యలు వివరిస్తూ.. విమర్శలు గుప్పిస్తూ..!

ఏలూరు జిల్లాలో తొలిరోజు చంద్రబాబు పర్యటన

కలపర్రు టోల్‌గేట్ వద్ద ఘనస్వాగతం

దెందులూరు ఎంఎల్ఎ లండన్ బాబు అంటూ తీవ్ర విమర్శలు

ఫ్లెక్సీల వివాదంతో టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ



చింతలపూడిలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



కలపర్రు టోల్‌గేట్ వద్ద స్వాగతం పలికేందుకు తరలివచ్చిన అభిమానులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి

వైసిపి పాలనపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ప్రస్తుత పాలనలో జనం ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఏలూరు జిల్లాలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' పేరిట మాజీ సిఎం, టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన పర్యటన తొలిరోజు బుధవారం సాగింది. ఉదయం 11.20 గంటలకు చంద్రబాబు కలపర్రు టోల్‌గేట్ వద్దకు చేరుకునేసరికి అక్కడికి పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. చంద్రబాబుకు గజమాలతో టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. ఓపెన్ టాప్ వాహనంపై చంద్రబాబు అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం బైక్‌ర్యాలీగా కార్యకర్తలు ముందు సాగగా వెనుక చంద్రబాబు కాన్వాయ్ కదిలింది. జానంపేట మీదుగా మధ్యాహ్నం రెండున్నర గంటలకు ర్యాలీ విజయరాయి చేరుకుంది. మార్గమధ్యంలో మహిళలు హారతులిచ్చి చంద్రబాబుకు స్వాగతం పలికారు. విజయరాయి గ్రామంలోకి చేరుకోగానే జనం పెద్దఎత్తున చేరుకోవడంతో కాన్వాయ్ ముందుకెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. జనం పెద్దఎత్తున రావడంతో చంద్రబాబు ఉత్సాహంగా తన పర్యటన సాగించారు. విజయరాయిలో తొలుత పలువురి ఇళ్లకు వెళ్లి ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి హయాంలో కట్టిన ఇంటికి ఇంకా రూ.లక్షకుపైగా రావాల్సి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఇవ్వలేదని ఓ మహిళ తెలిపింది. మరో మహిళ తమకున్న రెండు ఎద్లలో ఒక ఎద్దు వైరస్‌తో చనిపోయిందని చెప్పగా మరో ఎద్దును కొనుగోలు చేసి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక సెంటరులోని బహిరంగ సభ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు.

ఇలాంటి స్పందన ఎప్పుడూ చూడలేదు

పశ్చిమగోదావరి జిల్లాకు కొన్ని వందలసార్లు వచ్చానని, ఇటువంటి స్పందన మాత్రం ఎప్పుడూ చూడలేదని చంద్రబాబు అన్నారు. స్కూల్ పిల్లలు బయటికి రాకుండా గేట్లు వేసినా వారి స్పందనను ఆపలేకపోయారన్నారు. దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయి చౌదరిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇక్కడ లండన్‌బాబు ఉన్నాడని, మళ్లీ శాశ్వతంగా లండన్ పంపిస్తామని అన్నారు. ఏ పార్టీతో పెట్టుకుంటున్నావో గుర్తుపెట్టుకో అంటూ హెచ్చరించారు. తాడేపల్లిలో ఒక సైకో.. ఇక్కడ ఒక సైకో తయారయ్యాడన్నారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నానన్నారు. కరెంటు, ఆర్‌టిసి ఛార్జీల పెంపు, నిత్యావసరాలు, వంటనూనె, పెట్రో, డీజిల్, మద్యం ధరలు పెరుగుదలతో జనం పడుతున్న సమస్యలను వివరించారు. పోలవరంను రివర్స్ టెండరింగ్ పేరుతో దెబ్బతీశారని తెలిపారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిచేసి నీటిఎద్దడి లేకుండా చేద్దామనుకున్నానని, దాన్ని పక్కన పెట్టేశారని అన్నారు. చింతమనేనిపై 29 కేసులు పెట్టారని, అందులో 14 అట్రాసిటీ కేసులు పెట్టారని తెలిపారు. మోటార్లకు మీటర్లు పెట్టి ఉరితాళ్లు వేస్తారట అని విమర్శించారు. పోలీసుల మెడపై కత్తిపెట్టి పనులు చేయిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెడతానని, పూర్వ వైభవం తెస్తానని, అది తన బాధ్యత అని తెలిపారు.

ఫ్లెక్సీల వివాదం

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వైసిపి నాయకులు పెట్టిన ఫ్లెక్సీలు వివాదస్పదమయ్యాయి. 'ఇదే మా అదృష్టం.. చంద్రబాబు నువ్వే మా ఖర్మ' అంటూ చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా ఫొటోలతో చింతలపూడి, ఫాతిమాపురంలో వైసిపి నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో చంద్రబాబు పర్యటన సాగుతుండగా కరెంట్ సరఫరా నిలిచిపోవడం వివాదాస్పదమైంది. ధర్మాజీగూడెంలో కొంతమంది యువకులు రోడ్డుపైకి వచ్చి పర్యటన వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు పక్కకు తీసుకువెళ్లడంతో జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ చింతమనేని ప్రభాకర్‌ను తిడుతూ వెళ్లారు. ధర్మాజీగూడెంలో బాలికలతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. రాత్రి చింతలపూడిలో బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం చేరుకుని దండమూడి రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆయన బస చేశారు.

నేడు పర్యటన ఇలా..

రెండో రోజు గురువారం చంద్రబాబు పర్యటన దండమూడి ఫంక్షన్ హాల్ వద్దనుంచి పోలవరం వరకూ సాగనుంది. బయ్యన్నగూడెం, కొయ్యలగూడెం, రేపల్లెవాడ, దిప్పకాయలపాడు, తంగేళ్లపాడు, కండ్రిగగూడెం, కన్నాపురం మీదుగా సాగి పోలవరంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడనున్నారు. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన సాగనుంది.

7న రబీకి సాగునీరు విడుదల

ఏప్రిల్ 10న కాలువలు మూసివేత

70,104 ఎకరాల్లో రబీసాగుకు ప్రణాళిక

రైతులకు అన్ని విధాలా అండగా ఉంటాం

సాగునీటి సలహా మండలి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రబీ సాగుకు ఈనెల ఏడో తేదీన కాలువలకు సాగునీటిని విడుదల చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని, శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జీ, శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెసి అరుణ్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మాట్లాడుతూ గోదావరిలో పుష్కలంగా సహజ జలాలు, సీలేరు, పోలవరం ప్రాజెక్టుల్లో వినియోగానికి మించి నీటి నిల్వ ఫలితంగా ఈ రబీ సీజన్లో నూరుశాతం ఆయకట్టుకు నీరు అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కాటన్ బ్యారేజీ పరిధిలోని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు 94.285 టిఎంసిల నీరు అవసరం కాగా ఈ ఏడాది అంతకు మించి 101.505 టిఎంసిలు అందుబాటులో ఉందన్నారు. 8,96,507 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. ఏలూరు జిల్లాలో రబీలో 70,104 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. జిల్లాలో రబీ అనంతరం ఏప్రిల్ పదో తేదీన కాలువలు మూసివేయాలని నిర్ణయించామన్నారు. కాలువల మూసివేతపై అప్పటి పరిస్థితులను బట్టి శాసన సభ్యులు, రైతులు సూచనల మేరకు సవరణ చేయాల్సి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ఎర్రకాలువ, తమ్మిలేరు, కొవ్వాడ ప్రాజెక్టు కింద రబీకి 17 వేల ఎకరాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నుండి మహా శివరాత్రి సందర్భంగా యాత్రికుల స్నానాలకు బలివే పుణ్యక్షేత్రానికి 50 టిఎంసిఎఫ్‌టి నీటిని ఐదు రోజులు సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రైతులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా కాలువలు ఏప్రిల్ పదో తేదీన మూసివేస్తున్న దృష్ట్యా ఆయా కాలువల అభివృద్ధి పనులకు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరు నాటికి టెండర్ల ప్రకియ పూర్తి చేసి ఖచ్చితంగా ఏప్రిల్‌లో పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా బలివేకు లక్ష మందిపైన యాత్రికులు వస్తారని ఈ మేరకు తమ్మిలేరు వద్ద మౌలిక సదుపాయాలకోసం సుమారు రూ.10 లక్షలు అవసరం కాగలవన్నారు. ఈ నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పందిస్తూ ఇందుకు సంబంధించిన ప్రతిపాధనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారును ఆదేశించారు. కృష్ణాడెల్టా పరిధిలోని ఏలూరు జిల్లాకు సంబంధించి నీటి విడుదలపై సంబంధిత ఇంజనీరింగ్ చీఫ్‌తో సంప్రదిస్తామని కలెక్టర్ చెప్పారు. పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ జల్లేరు రిజర్వాయర్ నిర్వహణ, ఇతర పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం లిఫ్టు పనులను పూర్తి చేయాలన్నారు. ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ నీటి లభ్యత ఉన్నందున ఈ విడతకూడా రబీ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నామన్నారు. వెంకయ్య వయ్యేరు కాలువ తదితర సబ్ ఛానల్స్ అభివృద్ధి పనులు కూడా సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గోదావరి కాలువ ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలోని 59,845 ఎకరాల ఆయకట్టుకు గాను నికర వరి 38,345 ఎకరాలు కాగా అత్తిలి కాలువ సంబంధించి గణపవరం మండలం పరిధిలో 6030 మొత్తం ఆయకట్టుకు నికర వరి 5530 ఎకరాలు, ఉండి కాలువకు సంబంధించి గణపవరం మండల పరిధిలో 14,684 ఎకరాల మొత్తం ఆయకట్టుకు గాను నికర వరి 10,742 , వెంకయ్య, వయ్యేరు కాలువ పరిధిలోని నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో 25,590 మొత్తం ఆయకట్టుకుగాను 15487 నికర వరి సాగుకు గాను మొత్తం కలిసి 70,104 ఎకరాలకు రబీలో సాగునీరు అవసరం అవుతుందన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు : యుటిఎఫ్



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎస్ సాధన కమిటీ ఏలూరు జిల్లా కన్వీనర్ కూన కమల్‌కుమార్ అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తున్న ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల అరెస్టుకు సిపిఎం ఖండన

ఏలూరు : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఎఫ్, డిఎ, ఎరియర్స్ తదితర ఆర్థిక బకాయిలు చెల్లించాలని విజయవాడలో ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా ఖండించారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.650 కోట్లు 2022 మార్చి నాటికి క్లియర్ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో ఆర్థిక శాఖ అధికారులు హామీ ఇచ్చారని, కానీ నేటి వరకూ బకాయిలు చెల్లించలేదన్నారు. పోలీసులు ధర్నాను అడ్డుకుని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, అధ్యక్షులు వెంకటేశ్వర్లుతో సహా 250 మందికిపైగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రామ్‌ప్రసాద్, లెనిన్



రామ్‌ప్రసాద్



లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.రామ్‌ప్రసాద్, కె.లెనిన్ ఎన్నికయ్యారు. రెండు రోజులుగా ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు సమకూర్చాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలను తక్షణం పంపిణీ చేయాలని కోరారు. ఏలూరు నగరంలో ప్రభుత్వ పీజీ, లా కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కె.రాంప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చేస్తానని చెప్పి నేడు ప్రభుత్వ విద్యను సర్వనాశనం చేశారని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ అమలు కాని నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సొంత లాభాల కోసం అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ ఇంటెన్షిప్ వల్ల విద్యార్థులకు ఉపయోగం లేదన్నారు. ఎవరి స్వలాభం కోసం ఇవన్నీ చేస్తున్నారో విద్యార్థులకు, ప్రజలకు త్వరలోనే తెలిసే అవకాశం ఉందన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ఏలూరు: జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని రైతాంగ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. రబీ సాగు సమయం ముందుకు రావడంతో ఆరుగాలం కష్టపడి పండించిన ఖరీఫ్ ధాన్యం కల్లాల్లోనే ఉండిపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వస్తే 34 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, 65 గోనె సంచులు మాత్రమే ఇస్తున్నారని, కొనుగోలు పరిమితి 40 బస్తాలకు పెంచి 80 గోనె సంచులు ఇవ్వాలని కోరారు. ఒక రైతు నుండి 12.5 ఎకరాలకు ధాన్యం కొనుగోలు చేయకూడదనే నిబంధన సవరించాలన్నారు. 17 తేమ శాతం మించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రబీకి గోదావరి పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. గోదావరి డెల్టాకు శివారు ప్రాంతంగా ఉన్న భీమడోలు, దెందులూరు, ఏలూరు మండలాల ఆయకట్టు భూములకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ఆధునీకరించాలన్నారు. ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.20 వేలు ధర చెల్లించాలని కోరారు. దొండ పందిళ్లు, ఉద్యాన పంటలకు సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలన్నారు. మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు, పశు బీమా పరిహారం నిధులు విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. పాడి గేదెల కొనుగోలుకు రుణాలు ఇవ్వాలన్నారు.

జగన్ నవరత్నాలు దేశానికి ఆదర్శం

జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదల సంక్షేమానికి రాష్ట్రంలో అమలవుతున్న 'నవరత్నాలు' దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర రవాణా శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యతిచ్చి దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విన్నూత్న సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. పేదరికమే అర్హతగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందించడంతోపాటు, వారికి పక్కాగృహాలు మంజూరు చేశామన్నారు.

శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యకు అమలు చేయాలని కోరారు. కదల్లేని పరిస్థితిలో ఉన్నప్పటికీ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి వారి ఇంటివద్దకు అధికారులను పంపించి పరిశీలించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలం బోడిగూడెంలోని ఉర్దూ పాఠశాలల్లోను, నాడు-నేడు కార్యక్రమంలో అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని కోరారు. ఏలూరులో డిగ్రీ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ, తేమ 17 శాతానికి మించిన ధాన్యం కూడా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలనీ, నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరారు. గోదావరి వరదలకు 45.1 కాంటూరులోని గ్రామాలతో పాటు వాటి పరిధిలోకి రాని నాలుగు గ్రామాలు ముంపునకు గురయ్యాయని, వాటిని కూడా 45.1 కాంటూర్ పరిధిలోకి తీసుకురావాలన్నారు.

దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ రైతుభరోసా- పిఎం కిసాన్ నిధులు కొంతమంది రైతులకు జమ కాలేదని, ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలోని కొంతమంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు త్వరితగతిన జమయ్యేలా చూడాలన్నారు. రేషన్ కార్డులో నమోదైన పిల్లలకు ప్రయివేటు ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలలకు వెళ్లడంతో ఆ రేషన్ కార్డులోని తల్లిదండ్రులకు పెన్షన్ మంజూరు కావడం లేదన్నారు. ముంపు మండలాల్లోని కొంతమంది రైతులకు రైతుభరోసా జమ కాలేదని, బుట్టాయగూడెంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలనీ, గిరిజన గ్రామాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలనీ, సత్యసాయి తాగునీటి పథకం పనులు త్వరితగతిన పూర్తిచేసి వాటి పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి జలాలతో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలకు తాగునీటి సౌకర్యానికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ విజయవాడలోని ఆరోగ్యశ్రీ వర్తించే కొన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిరాకరిస్తున్నారని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో అమ్మఒడికి అర్హులైన 65 మందికి నిధులు మంజూరు కాలేదని, సామజిక సర్వే హౌస్ హోల్డ్ మాపింగ్ కారణంగా రేషన్ కార్డులోని పిల్లలు ఉద్యోగం చేస్తూ ఉన్న కారణంగా మంజూరు కాలేదని తెలియజేశారన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం సరిపోవడం లేదని, నిర్దేశించిన మొత్తం కన్నా 20 శాతం పెంచి నిర్ణయించాలని కోరారు. ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల లే అవుట్‌లలో నీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, సరిపల్లి కాలనీలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలనీ కోరారు. ఏలూరు శాసనసభ్యులు ఆళ్ల నాని మాట్లాడుతూ రేషన్ కార్డులో నమోదైన పిల్లలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు వెళ్లడంతో ఆ రేషన్‌కార్డులోని తల్లితండ్రులకు పెన్షన్ మంజూరు కావడం లేదని, ఒంటరి మహిళలకు పెన్షన్ మంజూరులో సమస్యలు వస్తున్నాయని, అర్హులైన వారికి పెన్షన్ మంజూరుకు సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 2.28 లక్షల ఎకరాలలో రైతులు వరి సాగు చేశారని, ఇ-క్రాప్ నమోదు 99 శాతం పూర్తయిందన్నారు. మిల్లర్లు, దళారుల ప్రమేయం లేకుండా రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు ధాన్యం కొనుగోలుకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ, జెసి పి.అరుణ్‌బాబు, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్ర పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్గదర్శకులు గురజాడ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహాకవి గురజాడ అప్పారావు అందరికీ మార్గదర్శకులని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన గురజాడ వర్ధంతిసభలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం నాటకంతో తెలుగు నాటకరంగం నూతన ఒరవడితో పాటు మహిళ అభ్యుదయమనే వాస్తవాన్ని తెలుగు ప్రజల ముందుంచారన్నారు. దేశమంటే మట్టి కాదంటూ నిజమైన దేశభక్తి అంటే ఏంటో ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. తిరుమల ఛాందసవాద చాగంటికి గురజాడ పురస్కారం ఇవ్వడం ఆయనను అవమానించడమేనన్నారు. తిరుగమన భావాలకు పెద్దపీఠం వేసినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.రామకృష్ణ, డివిడి.ప్రసాద్, ఎం.జీవరత్నం, నరసింహారావు, పిల్లి రామకృష్ణ, కిషోర్, మంగరాజు, టి.నాగమణి, ఎస్‌కె.సుభాషిణి పాల్గొన్నారు.

ఏలూరు: శ్రీకృష్ణ దేవరాయ కార్పొరేషన్ హై స్కూల్లో ఎవిఆర్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో గురజాడ 107వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.కేదార్ అధ్యక్షత వహించారు. ఏలూరులోని తూర్పువీధి శ్రీకృష్ణ దేవరాయ స్కూల్లోని గురజాడ అప్పారావు విగ్రహానికి టీచర్స్ తరపున కేదార్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం తరపున గుడిపాటి నరసింహారావు పూలమాలలు వేశారు. అనంతరం గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ గురజాడ స్త్రీల పక్షపాతిగా చేసిన రచనలు వివరించారు. పాత్రోచిత భాష, మధుర వాణి కథానాయికగా ఉండటం, కన్యాశుల్కం నాటకం గొప్పదనం అని, అలాంటి రచన ఇప్పటికీ మరొకటి రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యాలరావు, ఎ.జ్యోతిబాబు, ఎన్ఎల్.రమ్య, జి.శిరీష, జి.సుధ, వి.గాయత్రి, సుజాత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభ విజయవంతానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల ప్రచారయాత్ర రెండో రోజు మండలంలోని రెడ్డిగణపవరంలో ప్రారంభమైంది. తోలుత మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. యాత్రనుద్దేశించి ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు తుమ్మల సత్యనారాయణ, ఉడత వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.సాయికృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్, రైతు సంఘం జిల్లా నాయకులు కోరసా జలపాలు, పూనెం దుర్గారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ఆటో ప్రచార యాత్ర రెండోరోజు బుధవారం జీలుగుమిల్లి మండలానికి చేరింది. మండలంలోని ములగలంపల్లి, పాములవారిగూడెం, మడకవారిగూడెం, దాట్లవారిగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం పంచాయతీల్లో ప్రచారయాత్ర సాగింది. దీనిలో భాగంగా ములగలంపల్లి ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద కూలీలతో నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కామ ముత్యాలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి దానియేలు, ఉడత వెంకటేశు, గిరిజన సంఘం నాయకులు భాస్కర్, సంఘం జిల్లా కమిటీ సభ్యులు సాయికృష్ణ, మంగరాజు పాల్గొన్నారు.

ముదినేపల్లి : వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ప్రచార జాతా ముదినేపల్లి చేరుకుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేష్, కార్యకర్తలు డి.నాగేశ్వరరావు, చిన్నం మాధవ్, చిన్నం శ్రీకాంత్, మీసాల కుమార్, పాల్గొన్నారు.

వేలేరుపాడు : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వసంతవాడ గ్రామంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జీపు యాత్ర రెండోరోజు బుధవారం వేలేరుపాడుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కారం వెంకటరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్, రైతు సంఘం నాయకులు, కొత్త వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మల వెంకట నరసయ్య, దుర్గ, అక్కమ్మ, కుంజ దుర్గ, చిన్నక్క, కొక్కెరపాటి రవీంద్ర, జిల్లా నాయకులు, దానియేలు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు: వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, సిఐటియు నాయకులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. సంఘం నాయకులు గవర సత్యనారాయణ అధ్యక్షతన ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, బార్నాల పెద్దిరాజు, దారాబత్తుల ప్రభాకరరావు, మిండి బాపిరాజు, శోభన్‌బాబు, అంబల శ్రీను పాల్గొన్నారు.

కలిదిండి : వ్య.కా.స రాష్ట్ర మహాసభకు అన్నిరంగాల కార్మికులు తరలిరావాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. కలిదిండిలో నిర్వహించిన ప్రచార జాతాకు వ్యవసాయ, బిల్డింగ్, ఆటో కార్మికులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కుల మహేష్, కార్యకర్తలు చిన్నం శ్రీకాంత్, పరసా రాజేష్, కుడిపూడి శ్రీను, జోగి ఏసు, పంతగాని ప్రకాష్, గద్దె అనిల్, గంటా సోమయ్య, మీసాల కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో గురజాడ అప్పారావు వర్ధంతి సభ

ప్రజాశక్తి - చింతలపూడి

గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరిని ప్రజాసంఘాల నాయకులు అశోక్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల(మేదబడి)లో మహనీయుల ఆశయ ప్రచార కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహనీయుడు గురజాడ అప్పారావు 107వ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అనే గేయాన్ని పాడించారు. అనంతరం గురజాడ అప్పారావు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.అశోక్, సురేంద్ర, పి.సరేశ్వరరావు, రహీం, ఎం.వరలక్ష్మి, ఎ.రాహుల్, ఉపాధ్యాయులు సిహెచ్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


రైస్‌మిల్లులో ధాన్యం పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ కలెక్టర్ బి.బాలకృష్ణ

తేమ 17 శాతం ఉంటేనే ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - గణపవరం

17 శాతం తేమ ఉంటేనే రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్, పౌరసరఫరాల శాఖ ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి బి.బాలకృష్ణ అన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను, సొసైటీలను ధాన్యం ప్రక్రియపై ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు గణపవరం తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, సొసైటీ కార్యదర్శి మద్దాల నారాయణ ఉన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని సరిపల్లి పంచాయతీ వద్ద స్థానికులకు, వాలంటీర్లకు తడి, పొడి చెత్తపై సర్పంచి లక్ష్మీవాని అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చనుమూరి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దైవాల ఆంజనేయులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో పది మంది తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి తలసేమియా భవనాన్ని సందర్శించి రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మాత్రమే తలసేమియా చిన్నారులను ఆదుకోగలమని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత వల్లభనేని శ్రీకర్‌ను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ జి.చైతన్యకిరణ్ పాల్గొన్నారు.

‘ఉపాధి’ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధి హామీ చట్టం అమల్లో సమస్యలు, అవకతవకలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎంపిడిఒ నందిపాటి ప్రేమాన్విత కోరారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులపై ఏమైనా సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. 8008103299 సమాచారం అందించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కాట్రేనిపాడులో టిప్పర్ బీభత్సం

వృద్ధురాలిని ఢీకొట్టిన వైనం - తల, మొండెం వేరు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కాట్రేనిపాడులో భయంకరమైన రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఆ బైక్‌పై వెనుక కూర్చున్న వృద్ధురాలి తల లారీ చక్రం కింద పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనీపాడు గ్రామానికి చెందిన దాకారపు ఏసు మరియమ్మ(61) ఆమె బంధువు అయిన యువకునిపై బైక్‌పై నరసన్నపాలెంలోని కుమార్తె ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో కొంతదూరం వచ్చేసరికి హనుమాన్ జంక్షన్ నుంచి గోపవరం వైపు వేగంగా వస్తున్న టిప్పర్ లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు తల లారీ చక్రం కింద పడింది. వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి తల నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎం.కుటంబరావు, నూజివీడు సిఐ అంకబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


వృద్ధురాలి మృతదేహం


బోల్తాపడిన టిప్పర్

బాలికను వేధిస్తోన్న యువకునిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాలికను ప్రేమ పేరుతో వేధిస్తోన యువకునిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన యువకుడు తన వెంటపడి ప్రేమించాలని వేధిస్తున్నాడని ఎపిగుంట గ్రామానికి చెందిన బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమించకపోతే చంపుతానని, ఫొటోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టిడిపి, వైసిపి నేతల మధ్య వివాదం

పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి

ప్రజాశక్తి - చింతలపూడి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో వైసిపి నేతలు ఇదే మా అదృష్టం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఫాతిమాపురం వద్ద టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తోపులాటలు జరిగాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ఉపాధ్యాయులపై ఉక్కుపాదం దుర్మార్గం : ఎంఎల్‌సి సాబ్జీ


నిరసన జాగరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ


ప్రజాశక్తి - ఏలూరు

బకాయిల కోసం ఉద్యమం చేస్తున్న ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపటం దుర్మార్గమని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పిఎఫ్, ఎపిజిఎల్ఐ డిఎ ఎరియర్ల బకాయిలు ఇవ్వాలని కోరుతూ నవంబర్ 22వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నా చేసినా పరిష్కారం లేకపోవడంతో బుధవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చి ప్రభుత్వ అనుమతి తీసుకుని కార్యక్రమ నిర్వహణ కోసం ధర్నాలో పాల్గొనడం కోసం విజయవాడ వెళ్లిన వందలాది మంది ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ నిర్బంధించడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కూడా యుటిఎఫ్ కార్యకర్తలపై బైండోవర్ కేసులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం, గృహ నిర్బంధాలతో కొన్ని వేల మందిని పోలీసులు గృహ నిర్బంధం విధించి ధర్నాకు రాకుండా చేయడం దారుణమన్నారు. యుటిఎఫ్ పోరాట కార్యక్రమంపై విధించిన నిర్బంధఖాండను నిరసిస్తూ, అరెస్టులను ఖండిస్తూ అన్ని జిల్లాలు, డివిజన్ కేంద్రాల్లో సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిరసన జాగరణ కార్యక్రమం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫాఅలీ అధ్యక్షతన నిర్వహించిన నిరసన జాగరణ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం దమనకాండను చూపించి నిర్బంధాలను విధించి ఆ ధర్నాను భగ్నం చేయడానికి చేసినటువంటి తీరు అప్రజాస్వామికమని ఆయన చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.నరసింహరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో బకాయిపడిన రూ.1820 కోట్లలో భాగంగా మన జిల్లాలో రూ.115 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించకపోతే పెద్దస్థాయిలో మరోసారి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బి.సుభాషిణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విబివిఎస్.సుబ్రహ్మణ్యం, వి.కనకదుర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏలూరు డివిజన్ అన్ని శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జగనన్న విద్యాదీవెనను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో బుధవారం నిర్వహించిన జగనన్న విద్యాదీవెన నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొని చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, వైస్ ఎంపిపి గోగులోతు మోహనరావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, కో ఆప్షన్ సైదు బాజీ, ఎంపిడిఒ వాణి, ఎస్ఐ జయబాబు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో...


కైకలూరులో...

కైకలూరు రూరల్ : ఎంత ఖర్చైనా భరించి యువత భవితకు బాటలు వేయాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన విద్యాసంక్షేమ పథకాలు సత్ఫాలితాలను ఇస్తున్నాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైవిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న విద్యాదీవెన లబ్ధి పంపిణీ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమం దిశగా ప్రభుత్వం పిల్లల తల్లుల ఖాతాలో విద్యాదీవెన సొమ్ము జమ చేస్తుందని చెప్పారు. ఒక్క నియోజకవర్గంలోనే సంవత్సరానికి ఈ ఒక్క పథకం కింద రూ.13 కోట్లు జమ చేస్తుందని చెప్పారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ప్రపంచంలోని మొదటి వంద విశ్వవిద్యాలయాల్లో సీటు సాధించగలిగితే రూ.కోటి, వంద నుంచి రెండొందల లోపు విశ్వవిద్యాలయాల్లో అయితే రూ.50 లక్షలు ఫీజు ప్రభుత్వమే భరిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో 4888 మంది విద్యార్థులకు రూ.3.32 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు నమూనా చెక్కును విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, టౌన్ సిఐ నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వెంకట రత్నమ్మ పాల్గొన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా సురేష్, ఫ్రాన్సిస్


సురేష్, ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏలూరు జిల్లా కన్వీనర్ అందుగుల ఫ్రాన్సిస్, కో కన్వీనర్ మంగం సురేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కెవిపిఎస్ రాష్ట్ర నాలుగో మహాసభ నవంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించారని తెలిపారు. ఈ మహాసభలో జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో ఏలూరు జిల్లా నుంచి తాను, సురేష్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎంపికైనట్లు తెలిపారు. దళిత సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాలకు తమ వంతు కృషి చేస్తామని ఫ్రాన్సిస్ చెప్పారు.

కానుకొల్లులో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మండవల్లి


ఆదర్శవంతమైన స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కానుకొల్లులో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించుకుంటే ప్రధాన రహదారులు ఎంతో అందంగా ఉంటాయన్నారు. అంతేకాకుండా గ్రామంలోని మురుగునీరు పోయేలా డ్రెయినేజీ ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకుంటే గ్రామం ఎంతో స్వచ్ఛంగా ఉంటుందన్నారు. వ్యాధులు దరి చేరవని చెప్పారు. ఈ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చడానికి సర్పంచి నాగరాజ్ థామస్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఎంపిటిసి సభ్యులు పొట్టి మీనాకుమారి, సర్పంచి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ఎపిఎన్‌జిఒ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎపి ఎన్‌జిఒస్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీకి ఎన్నికల అధికారిగా బి.నాగేశ్వరరావు, సహాయ అధికారి శ్రీనివాసరావు, అబ్జర్వర్‌గా పి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఎంపి పి గంజిమాల రామారావు, ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ అభినందించారు. మాజీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.శ్రీనివాసరావు, ఎన్‌వి.రామారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.



ఎన్నికైన నూతన కమిటీ

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ


ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు బిసి హాస్టల్‌లో విద్యార్థులకు వార్డెన్ నజీర్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు.

సాయిబాలపద్మకు ఘన సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక మహిళా శిశు సంక్షేమ శాఖ రీజియన్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మకు ఘన సత్కారం లభించింది. ఇటీవల రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజినల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మ పార్టీకి చేస్తున్న సేవలు, నిర్వర్తిస్తున్న బాధ్యతలు గుర్తించి హోం శాఖామంత్రి తానేటి వనిత, పర్యాటక శాఖామంత్రి ఆర్‌కె.రోజా సంయుక్తంగా సాయిబాల పద్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాలపద్మ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ రీజియన్ చైర్‌పర్సన్‌గా తన బాధ్యతలు నిర్వహించడంతో పాటు, వైసిపి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ చేస్తున్న కృషికి గుర్తింపునివ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి మార్గాని భరత్, పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, వంగపండు ఉష తదితరులు పాల్గొన్నారని ఆమె తెలిపారు.


సాయిబాలపద్మను సత్కరిస్తున్న వనిత రోజా

నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ బిల్డింగ్ నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయాలన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో ఈ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ ఆయన తనయుడు సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ నిధులు రూ.1280 కోట్లు దారి మళ్లించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వాడుకున్న సంక్షేమబోర్డు నిధులను తక్షణం జమ చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ నిర్మాణ మెటీరియల్ ధరలు నియంత్రించాలని కోరారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాద్దేశించి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి అమలు చేయాల్సిన పథకాలు ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం హయాంలో పది క్లయిములు అయితే కనీసం ఐదు క్లయిములు ఇచ్చేవారని, కానీ ఈ ప్రభుత్వం మాత్రం ఒక్కటి కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సిఐటియు నగర అధ్యక్షులు బి జగన్నాధ రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, నాయకులు శ్రీను, టి.రాజు, జి.నరసింహారావు, జి.రవిబాబు, గోపాల్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో గార్డెన్ ఏర్పాటు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కళాశాలలో గార్డెన్ ఏర్పాటు చేసినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి తెలిపారు. కాలేజీ ఆవరణలో గార్డెన్ అందంగా తీర్చిదిద్దడానికి అనేక రకాల మొక్కలు నాటినట్లు తెలిపారు. గార్డెన్ ఏర్పాటు చేయడానికి సహకరించిన కాలేజీ అభివృద్ధి ప్రణాళిక విభాగం కార్యదర్శి కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, సభ్యులు చింతలపాటి వెంకట సత్యనారాయణరాజు, నడింపల్లి శ్రీరామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కరాజు, కె.స్వరూప్‌రాణి, ఎన్‌విఎన్‌బి.శ్రీనివాసరావు, జికె.వెంకట రమణ, ఎస్‌కె పర్వీన్, విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రారంభానికి కైకలూరు నుంచి భారీగా తరలివెళ్లారు. బుధవారం మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. దెందులూరు నియోజకవర్గంలోని విజయరా యి సమీపంలో చంద్రబాబును కలిసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, పూల రామచంద్రరావు, సయ్యపు రాజు గుర్రాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, బలే ఏసురాజు, మాల్యాద్రి, గాలి ప్రసాద్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చనుబండ గ్రామం నుంచి 70 కార్లు, వంద బైక్‌పై కార్యకర్తలు ర్యాలీగా చింతలపూడి తరలి వెళ్లారు.

నూజివీడు : టిడిపి సీనియర్ నేత, నూజివీడు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రావిచర్ల గ్రామం నుంచి ముసునూరు మండలంలోని బలివే సమీపంలోని విజయరాయి వరకు ఈ బైక్ ర్యాలీ కొనసాగించారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న సందర్భంగా టిడిపి నేతలు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాస రావు మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడి, టిడిపి పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. నూజివీడు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో టిడిపి నేతలు పాల్గొన్నారు.


వంతెన పరిశీలిస్తున్న తహశీల్దార్,ఎస్ఐ

రేకుల వంతెన పరిశీలన

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మండలంలోని పందిరిపల్లిగూడెంగూడెం వద్ద సర్కారు కాలువపై గ్రామస్తులు ఏర్పాటు చేసిన వంతెనను తహశీల్దార్ మురళీకృష్ణ, ఎస్ఐ కృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెనపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలకు సూచించారు. వంతెనకు మరమ్మతులు చేయించాలని చెప్పారు. పరిమిది దారులు పెట్టాలని, దారులను సూచించే బోర్డు వాహనదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు.

రామాలయం పున:నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ గ్రామంలో రామాలయం పున.నిర్మానానికి బుధవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. శిథిలావస్థకు చేరిన రామాలయం స్థానంలో నూతన రామాలయం పున:నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాచూరి రాధా, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, గ్రామ సర్పంచి మంచాల సరస్వతి, వైస్ సర్పంచి పి.కిరణ్మయి, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు, నాయకులు బొర్రా శేషుబాబు, కె.విష్ణువర్ధన్, సాయి, రాజా, సతీష్, కొండ, గంగయ్య గణేష్ పాల్గొన్నారు.